

హెలెన్ కెల్లర్ జీవితం అందరికీ ఆదర్శం


మాట్లాడుతున్న డాక్టర్ గోపీకృష్ణ

మదనపల్లె అర్బన్: హెలెన్ కెల్లర్ జీవితం అందరికీ ఆదర్శమని అమృత ఆస్పత్రి డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని వెలుగు సంస్థలో 'హెలెన్ కెల్లర్'డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు ప్రత్యేక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ప్రభావం విద్యార్థుల మీద ఎంతో ఉంటుందన్నారు. హెలెన్ కెల్లర్ బాచిలర్ అఫ్ ఆర్ట్స్‌లో డిగ్రీ సంపాదించిన మొట్టమొదటి చెవిటి, అంధురాలిగా చరిత్రలో నిలిచిపోయిందని కొనియాడారు. వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపిల్ లీనా కుమారి మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ బాల్యం గురించి ఆమె గొప్పతనం గురించి ఎంతో చక్కగా వివరించారు. అనంతరం చిన్నారులు, వృద్ధులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.

సా..గుతున్న సహకారం



జిల్లాలో వ్యవసాయ రుణాల మంజూరు ప్రక్రియ మందకొడిగా సా..గుతోంది. జిల్లా కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు ఆదేశాలతో ప్రాథమిక సహకార సంఘాలు పకడ్బందీగా రైతు రుణ పంపిణీకి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన రుణాలను జూన్, జులై మాసాల్లో మంజూరు చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు నెల రోజులు గడుస్తున్నప్పటికీ 20 శాతమే రుణాలను మంజూరు చేయడం ఆందోళన కలిగిస్తోంది. జులై నెలాఖరు నాటికి పంటల సాగు ముగియనున్న నేపథ్యంలో మిగిలిన 80 శాతం లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉంది. నెల రోజుల వ్యవధిలో ఇంతటి భారీ లక్ష్యాన్ని అధిగమించడంపై సందేహాలు నెలకొన్నాయి.

రూ.500 కోట్లు రుణాలు కేటాయింపు
నేటికి 20 శాతమే రుణ పంపిణీ
ఆందోళనలో జిల్లా రైతాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2023-24 ఖరీఫ్ సీజన్‌లో రూ.500 కోట్ల వ్యవసాయ రుణాలను పంపిణీ చేయాలనే లక్ష్యాన్ని జిల్లా కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు జిల్లా యంత్రాంగం నిర్దేశించుకుంది. ఉమ్మడి కడప జిల్లాలోని 72 ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు ఆదేశాలు జారీ చేసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న నేపథ్య ంలో రూ.100 కోట్ల రుణాలను మాత్రమే పంపిణీ చేసింది. ఈలెక్కన 20 శాతం రుణాలను మాత్రమే మంజూరు చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 80 శాతం రుణాలను జులై నెలాఖరు నాటికి మంజూరు చేయాల్సి ఉంది. ఖరీఫ్ ఆలస్యమైన నేపథ్యంలో రైతాంగం వ్యవసాయ రుణాల సేకరణపై పూర్తిస్థాయి దృష్టి సారించింది. ఇటువంటి పరిస్థితుల్లో 20 శాతం మంజూరు చేయడంపై ఆందోళన నెలకొంది. వర్షాలు ఊపందుకున్న నేపథ్యంలో రైతాంగం పంటల సాగుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించనుండడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాల మంజూరు చేయడంపై సందేహం నెలకొంది.

బుక్‌అడ్జస్ట్‌మెంట్లే శరణ్యమా?

ఉమ్మడి జిల్లాలోని 72 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని 47 ప్రాథమిక సహకార సంఘాలు, అన్నమయ్య జిల్లాలోని 25 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలోని 72 వేల మంది రైతులకు రుణాల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆలస్యంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటల సాగుపైనే దృష్టి కేంద్రీకరించారు. ఫలితంగా డిసిసిబి అధికారులు సుమారు 40 వేల మంది రైతుల రుణాలు బుక్ అడ్జెస్ట్‌మెంట్ పరిధిలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయనే వాదన రైతు సంఘాల నాయకుల నుంచి వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో బుక్‌అడ్జస్ట్‌మెంట్ బారిన పడిన రైతాంగం ప్రయివేటు వడ్డీ వ్యాపారాలను ఆశ్రయించే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయనడంలో సందేహం లేదు.



రైతులకు తప్పని తిప్పలు

ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా సాగైన నేపథ్యంలో రైతాంగం పంటల సాగు చేయడంపైనే దృష్టి సారించడం తెలిసిందే. డిసిసిబి అధికార యంత్రాంగం నిబంధనల్ని కఠినతరం చేసిన నేపథ్యంలో రైతులు రుణాల మంజూరుకు సంబంధించిన అడంగల్, ఒన్‌బి, ఇసి మొదలగు పత్రాల సేకరణకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడానికి సమయం దొరకని పరిస్థితి. రైతు రుణాలను మంజూరు చేయడానికి రైతుల దగ్గర నుంచి సేకరించిన ఇసి, అడంగల్, ఒన్‌బి, మార్ట్‌గేజ్ మొదలగు అంశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం రుణాలను మంజూరు చేస్తోంది. జిల్లా రుణ పరపతి కమిటీ ఆమోదించిన మేరకు పంటలను బట్టి రుణాలను మంజూరు చేస్తోంది. సాగుకు సరిపడా రుణాలు మంజూరు కావడం లేదనే వాదన రైతు సంఘాల నాయకుల నుంచి వినవస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మిగిలిన 80 శాతం రుణ పంపిణీ చేయడం సవాలుగా మారే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

రుణ పంపిణీని వేగవంతం చేయాలి

సహకార రుణ పంపిణీని వేగవంతం చేయాలి. ఖరీప్ సీజన్ నెల రోజుల్లో 20 శాతమే పంపిణీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా రైతులు సంబంధిత పత్రాలను అందజేయని నేపథ్యంలో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే అవకాశం ఉంది. జిల్లా అధికార యంత్రాంగం బుక్‌అడ్జస్ట్‌మెంట్లకు పరిమితం గాకుండా వంద శాతం రుణాలను మంజూరు చేయాలి. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవు

- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం, కడప.

లక్ష్యాన్ని అందుకుంటాం

ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఫలితంగా జులై, ఆగస్టు మాసాల్లోనూ రుణాలు మంజూరు చేయవడానికి అవకాశం లభించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన 80 శాతం లక్ష్యాన్ని అందుకుంటాం.

- రాజేంద్రకుమార్, డిసిసిబి, సిఇఒ, కడప.

కొండెక్కిన కూరగాయల ధరలు

పచ్చి మిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది.. టమోటా ఒక్కసారి ఆకాశంలో ఎక్కి కూర్చుంది.. మేమేం తక్కువా అన్నట్లు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి.. 15 రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు వామ్మో అంటున్నారు.. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళితే... సగం బస్తా కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిర్చి ధర మార్కెట్‌లో రూ.100, కాకర రూ.50కి చేరింది. టమోటా రూ.60 నుంచి 80 మధ్యలో ఉంది. ప్రతి వస్తువు ధర పెరిగి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల సాగు తగ్గిపోవడం, ఎండివేడిమితో తోటలు దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. మార్కెట్‌కు ఎక్కువగా దిగుబడులు వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు.

- తారెత్తిస్తున్న టమోటా
- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- వీటి బాటలోనే బీన్స్, క్యారెట్
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



ప్రజాశక్తి-రాయచోటి

సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కూరగాయలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. వారి వంటింట్లో ఉడకనంటూ భీష్మించుకున్నాయి. సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్టుకు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో టమోటాను పట్టుకుంటే దాని ధర తారెత్తిస్తోంది. పచ్చిమిర్చి ధర ఘాటెక్కి తనను ముట్టుకోవద్దంటోంది. ఇలా ప్రతి కూరగాయి సామాన్యుడిని ముట్టుకోనీయడం లేదు. ఎందుకంటే వాటి ధరలు అంత అమాంతంగా పెరిగి ఆకాశానికి నిచ్చనేశాయి. కనీసం పచ్చడి మెతుకులు తిందామనుకుంటే పచ్చిమిర్చి ధర రూ.100 చేరి అందనంత ఎత్తులో ఉంది. అన్నమయ్య జిల్లాలో ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలో దేవపట్ల, సంబేపల్లి, చిన్నమండెం, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లి ప్రాంతాల్లో టమోటాల సాగు అధికంగా ఉంది. నెల కిందట రైతులకు గిట్టుబాటు ధరలు లేక టమోటాలను రోడ్లపైనే పారే వేసి వెళ్లేవారు. ఇటీవల టమోటా ధర బాగా పెరగడంతో ఇదే అదునుగా దళారీలు సొమ్ము చేసుకుంటూ అధిక ధరలకు విక్రయించడం మొదలుపెట్టారు .ఇదేమిటి అంటే కూరగాయల సాగు తగ్గిందని ధరలు పెరిగాయి అంటూ చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. గతంలో కిలో టమోటా ధర రూ.5, 10 ఉండగా నేడు ఏకంగా రూ. 60 నుండి రూ.80 వరకు చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం తప్పదు కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు. వంకాయలు గతంలో కిలో రూ.30 నుండి రూ.40 ఉండగా నేడు అమాంతంగా రూ.60 నుంచి రూ.80, మునగ రూ.100 విక్రయిస్తున్నారు. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.15 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.40కు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేకున్నాయి. ఇక పచ్చిమిరపకాయల మాట ఎత్తుకుంటే కిలో రూ.వంద చొప్పున అమ్మకం సాగిస్తున్నారు . ఇదేమిటి అంటే ఈసారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. ఇక ఆకుకూరల ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూరను తీసుకున్నా రూ.10 ఉంది. ముఖ్యంగా మెంతి ఆకు, పాలకు, చుక్కాకు, గోంగూర, చింతాకు వంటివి కూడా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇది ఇలా ఉంటే రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ధరలను నియంత్రించాల్సిన అధికారులు ఏ ఒక్కరూ రైతు మార్కెట్ వైపు చూసిన పాపాన పోలేదు. కూరగాల తూకాల్లోనూ మోసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు రైతు బజార్లలో, మార్కెట్లలో సందర్శించి కూరగాయల ధరలు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి



మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా కూరగాయల ధరలను పెంచేశారు. మార్కెట్లకు వెళ్తే ఏ కూరగాయలు కొని తినే పరిస్థితులలో లేం. అధికారులు స్పందించి కూరగాయల ధరలు వెంటనే నియంత్రించాలి.

- నాగసుధ, గృహిణి, రాయచోటి .

వ్యాపారులు దోచుకుంటున్నారు



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ విపరీతంగా రేట్లను పెంచడంతో రవాణా ద్వారా ట్రాన్స్‌పోర్టు ద్వారా నిత్యావసర, కూరగాయలు రేట్లు అధికమయ్యాయి. దీని వల్ల రైతుల కంటే దళారులు ఎక్కువ ఫలితం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.


సంతకాలు సేకరిస్తున్న వామపక్ష నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణ అన్నారు. మంగళవారం వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్తు బిల్లులపై ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారం ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపటం దారుణమన్నారు. అప్పుల కోసం వైసిపి ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సంస్కరణలకు దాసోహం అవడం శోచనీయమన్నారు. ప్రజలపై విద్యుత్ భారం తీవ్రంగా ఉందని తెలిపారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, అదనపు లోడ్ డిపాజిట్లు, అదనపు కస్టమర్ ఛార్జీలు వివిధ రూపాల్లో ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. మోడీ, జగన్ కలసి సామాన్యుల నడ్డి విడుస్తున్నారని, చిరువ్యాపారుల నుండి చిన్న పరిశ్రమల వరకూ ప్రతిఒక్కరూ బాధితులేనని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అన్ని పట్టణాల్లో వర్తక, వాణిజ్య సంఘాలు, కాలనీ అసోసియేషన్లు, పౌర సంఘాలతో కలిసి జూన్ 30న ధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని, అందుకోసం ఈ నెల 30న జిల్లా వ్యాప్తంగా జరుగు ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాయుడు, సికిందర్, వెంకటయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్, మహమ్మద్, హరి, ఎఐవైఎఫ్ నాయకులు శరత్, ఎఐటియుసి నాయకులు నాగేశ్వర్, గంగయ్య, చంద్ర తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి, ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఎస్‌పి గంగాధర్ రావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులపై దృష్టి సారించాలన్నారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా, అక్రమ మద్యం, నాటుసారా, నిషేదిక వస్తువులపై దృష్టి సారించాలన్నారు. అలాగే వాహనాల తనిఖీ ముమ్మరం చేసి, ప్రతి ఒక్క ద్విచక్రవాహన దారుడు హెల్మెట్ వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులు లైసెన్సు, వాహన రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ సురేష్ కుమార్, ఎస్ఐ నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌పి గంగాధర్ రావు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గిరీష వైద్య అధికారులకు ఆదేశించారు. మండలంలోని కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి ప్రతిరోజు రోగులు ఎంత మంది వస్తున్నారు. ఇన్ పేషంట్స్ వారి గురించి వాకబు చేశారు. తదుపరి ఫార్మసీ స్టోర్ ఇన్‌స్పెక్షన్ చేయడం జరిగింది. మందుల నిల్వ, ఒపి సేవలు, సిబ్బంది హాజరు తదితర రిజిస్టర్‌లు కలెక్టర్ పరిశీలించారు. నిన్న, మొన్న ఎంత మందికి మందులు ఇచ్చారు వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో రికార్డులను పరిశీలించి ఇచ్చిన మందులకు సంబంధించి ఎందుకు డేటా ఎంట్రీ సరిగా చేయలేదని ఫార్మసిస్ట్, వైద్య అధికారులపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి తెచ్చారన్నారు. విలేజ్ క్లినిక్‌లో కావలసినంత మందులు అందుబాటులో ఉంచాలని డాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు ఎంతమందికి టెస్టింగ్ చేస్తున్నారు వంటి రిపోర్టులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వార్డు రూమును పరిశీలించి రోగుల వైద్య సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని కాబట్టి జవాబు దారీ తనంతో పనిచేయాలని సూచించారు. ఈ సందఠరేగా ఆస్పత్రిలోని వసతులను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్యసేవలు అందుతున్నాయని లేదా అని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం టిబి రోగులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుదర్శన్ రెడ్డి, ఎంపిటిసి సర్పంచ్, తహశీల్దార్, ఎంపిడిఒ, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పిహెచ్‌సిలో రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ గిరీష

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీ


విభిన్న ప్రతిభావంతుడితో మాట్లాడుతున్న శ్రీనివాసులు

పుల్లంపేట : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దళవాయిపల్లి, కేతరాజుపల్లిలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులతో కలిసి ఆయన గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలన అందించడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సాధ్యమని తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ దేశానికే ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతులను సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ నాగిరెడ్డి హరినాథరెడ్డి, తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఇఒపిఆర్‌డి ప్రకాశం, మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, డిఎస్‌పి చైతన్య, సిఐ పుల్లయ్య, ఎస్ఐ రఘురాం, రైల్వేకోడూరు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాయకులు రామనాథం, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రఘువీరారెడ్డిని కలిసిన అల్లా బకాష్

ప్రజాశక్తి- రాయచోటి

కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు రఘువీరారెడ్డిని తన నివాసంలో రాయచోటి నియోజకవర్గం సమన్వయకర్త ఎస్.అల్లా బకాష్ (సిఎల్‌పి) మంగళవారం కలిశారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయనతో చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాబోయేవి అన్నీ మంచి రోజులేనని ఆయన అన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాయచోటి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ గురించి ఎలా ఉందని అడిగారు. రాయచోటి నియోజవర్గంలో దాదాపు కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలు మక్కువ చూపుతున్నారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని అల్లాబకాస్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రఘువీరారెడ్డితో కాంగ్రెస్ నాయకులు

ఘనంగా బంకిం చంద్ర ఛటర్జీ జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర ఛటర్జీ జయంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని గండబోయనపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఛటర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ భారత దేశంలోని గొప్ప కవులు, నవలా రచయితలలో బంకిం చంద్ర ఛటర్జీ ఒకరని పేర్కొన్నారు. 1882లో అయన రచించిన ఆనందమట్ నవలలో ఉన్న వందేమాతరం గీతం నేటి భారత జాతీయ గేయమైందన్నారు. స్వతంత్ర సమరంలో యావత్ భారతదేశాన్ని వందేమాతరం ఉర్రుతలూగించిందని, స్వాతంత్ర విప్లవ గీతంగా భారతీయులందరూ గానం చేశారని, బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సింహగర్జనలా ఆ గేయం మారుమోగిందని పేర్కొన్నారు. దేశ భక్తికి, స్వాతంత్ర్య పిపాసకు వందేమాతర గీతం ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు మురళి, శ్రీకాంత్, కిషోర్, శేఖర్, శ్రీలత, ఉషారాణి, సిరాజున్నీసా, రూప, విద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలో బక్రీద్ పండగ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ నెల 29,30, జులై 1న బక్రీద్ సందర్భంగా ఖుర్బాని కోసం పట్టణంలో బండ్ల పెంట, ఫ్రూట్స్ మండీ, మహబూబ్ నగర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక జంతు వధ శాలలను సందర్శించారు..అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టామని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు అర్బన్ సిఐ తెలిపారు. శాంతియుత వాతావరణంలో పండుగల నిర్వహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, అర్బన్ ఎస్ఐ నరసింహ రెడ్డి పాల్గొన్నారు.


జగనన్న సురక్ష సర్వేను పరిశీలించిన కలెక్టర్ గిరీష

'జగనన్న సురక్ష'తో ఇంటి వద్దకే సేవలు

ప్రజాశక్తి-గాలివీడు

ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలు అందించే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గిరీష తెలిపారు. మంగళవారం మండలంలోని ప్యారంపల్లె (రెడ్డివారిపల్లె)లో జగనన్న సురక్ష వాలంటీర్ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని ఇళ్లు సర్వే చేశారు, సర్వీస్ రిక్వెస్ట్ ఎంతమంది అడిగారు, టోకన్ జనరేట్ చేశారా వంటి వివరాలను వాలంటీర్, ఎంపిడిఒను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ మీ గ్రామంలో సర్వేపై దండోరా వేయించారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, వైఎస్సార్ రైతు భరోసా, చేయూత పథకాలు తమకు ఈ ప్రభుత్వంలో వచ్చాయిని లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అర్హత ఉండి లబ్ధి అందని వారిని గుర్తించి కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరించేందుకు అవసరమైన పత్రాలను సేకరించి టోకెన్లు అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్ నాయక్, సర్పంచ్, వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని ఎంఇఒలు గంగిరెడ్డి, సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని మందపల్లి దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. మన ఆస్తి మన పిల్లలేనని వారి పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తల్లిదండ్రులు కనబరచాలని పేర్కొన్నారు. వైసిపి నాయకులు శ్రీహరి మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన్నారు. దాత అల్లం సుబ్రమణ్యం 30 మంది విద్యార్థులు విద్యా సామగ్రిని అందజేశారు. ఆయన దాతృత్వాని ఎంఇఒలు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులు నీరగట్టు నరసింహులు, పాఠశాల హెడ్ టీచర్ పోలయ్య, సచివాలయ ఎడ్యుకేషన్ కార్యదర్శి వేంకటేశ్వరరాజు, సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఇఒ గంగిరెడ్డి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

జనజాగృతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రామాపురం

జూలై 7న విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాదిగల జనజాగృతి సభను విజయవంతం చేయాలని జిల్లా ఎంఆర్‌పిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర కో-కన్వీనర్ రామాంజనేయులు ఆదేశాలతో మంగళవారం మండలంలోని చిట్లూరు హరిజనవాడలో జిల్లా కో-కన్వనర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సంధ్భంగా దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యం లో జులై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్ లో ఎస్‌సి వర్గీకరణ కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మాదిగల జనజాగృతి సభను లక్షలాది మందితో విజయవంతం చేయాలని జాతికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు బాలిపోగు సాంబశివ, బాలరాజు, వెంకటరెడ్డయ్య, శ్రీకాంత్, ప్రసాద్‌రెడ్డి, కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి క్లస్టర్ ఏర్పాటు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చేనేతల సంక్షేమానికి చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేసినట్లు చేనేత డైరెక్టర్ వెంకట్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో మంగళవారం తంబళ్లపల్లిలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేశామన్నారు. నగర పంచాయతీ పరిధిలో చేనేత కార్మికులు, నియోజకవర్గం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ఈ క్లస్టర్ దోహదపడుతుందన్నారు. అర్హత కలిగిన చేనేత కార్మికులకు ప్రతి ఒక్కరికి 90 శాతం సబ్సిడీతో పనిముట్లు అందించే కార్యక్రమం జరుగుతుందని, తద్వారా వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి సిఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని, అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సురేంద్రనాథ్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నిరుపయోగ బోరుబావులను మూయించాలి

- జెసికి జనసేన నాయకుల వినతి

ప్రజాశక్తి-సుండుపల్లి


జెసికి వినతిపత్రం ఇస్తున్న రామశ్రీనివాసన్

మండలంలో నిరుపయోగంగా ఉన్న బోరు బావులను మూయించి ప్రమాదాలను నివారించాలని కోరుతూ జనసేనపార్టీ నాయ కులు రామశ్రీనివాసన్ మంగళవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలం లో కుప్పగుట్టపల్లి గ్రామంలో బోరుబావిలోపడి వ్యవసాయ ఆధారిత రైతు బయటికి రాలేని పరిస్థితిలో మృతిచెందాడని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరుపయోగంగా ఎన్నో బోరు ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో ఎవరికి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా నిరుపయోగంగా ఉన్న బోరుబావులను మూసివేతకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని తవళం గ్రామంలో ఉన్న నేలమల్లేశ్వరస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కిస్తున్నట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆలయంలోని హుండీలను బుధవారం ఉదయం పది గంటలకు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కిస్తున్నట్లు తెలిపారు. ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని తెలిపారు.

యువగళం పాదయాత్రకు విశేష స్పందన

ప్రజాశక్తి -చిట్వేలి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని టిడిపి తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు, చిట్వేలి మండల అధ్యక్షుడు కేకే చౌదరి పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా, గూడూరు నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్రకు 1800 కి.మీ. చేరుకున్న సందర్భంగా కెకె.చౌదరి లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. లోకేష్ పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో నిలిచి పోతుం దన్నారు. ప్రజలను దోచుకుంటున్న అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

నేడు బి.కొత్తకోట మండల సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించనున్నారన్నారు. అదేవిధంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హజరు కావాలని పేర్కొన్నారు.

పేదవాడి రాజ్యం రావాలి : ఆర్‌ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో దోపిడీ రాజ్యం పోయి పేదవాడి రాజ్యం రావాలి అని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని మాధవరం పంచాయితీలో కంచరపల్లె కాలనీ, ఎగువ కంచర పల్లె ,దిగువ కంచరపల్లె, పాలవాండ్లపల్లె, వెంకటాపురం , కొండకింద పల్లె, కాటినేనివారిపల్లె, పెయ్యాల వారి పల్లె, తమటం వారి పల్లెలలో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్ర బాబు గ్యారంటీ , రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దోపిడీ రాజ్యాంగ మారిందని విమర్శించారు. తెలుగువారి పేరు ప్రఖ్యాతులు భారతదేశంలో చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పేదవాడి ఆకలి గుర్తించి రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని, ఆడ పడుచులకు సమాన హక్కు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీనే అన్నారు. ప్రజల నుంచి ఎన్ను కోబడిన సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారని, వీరినిధులు జగన్ మోహన్‌రెడ్డి దారి తెలిపారు. కార్యక్రమంలో మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి రమణారెడ్డి ,సైకం రమేష్ రెడ్డి ,సైకం విశ్వనాధ రెడ్డి, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టండి :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందని, తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారిన ప్రతిపక్ష పార్టీలు ఎలాగైనా 2024 ఎన్నికల్లో గెలవాలని కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ కొత్త రెడ్డివారిపల్లె, రెడ్డివారిపల్లె, వాల్మీకిపురం పట్టణం కొత్త ఇందిరమ్మ కాలనీలలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను, కుతంత్రాలను ప్రజలే తిప్పికొట్టి పేదలకు మంచి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని, గతంలో టిడిపి అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల్ని మోసం చేశారన్నారు. మళ్లీ మోసపూరిత హామీలతో కిచిడి మేనిఫెస్టోను చంద్రబాబు ప్రకటించారని, చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర భవి ష్యత్తు దృష్ట్యా ప్రజలు ముఖ్యంత్రిని మరోమారు ఆదరించాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, వైస్ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, నాయకులు నీళ్ల భాస్కర్, రఘు, ఎల్లయ్య, మహబూబ్‌బాషా, రాయుడు, ఆనంద్, విశ్వనాథ్, నాగార్జున, రాజేష్, ఖాద్రి, రమేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' కార్యక్రమంపై అవగాహన


బి.కొత్తకోట : జగనన్న సురక్ష కార్యక్రమంలో డిఎల్‌డిఒ లక్ష్మీపతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు మదనపల్లె డిఎల్‌డిఒ లక్ష్మీపతి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సచివాలయం-2 పరిధిలోని సంత బజారులో సిబ్బందితో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని తీసు కొచ్చిందన్నారు. కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గృహసారథులు, వాలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. సమిష్టి కృషితో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ రమాదేవి, నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **కలకడ:** జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బాటవారిపల్లి సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం అవగాహన కల్పించి ధృవీకరణ పత్రాలు ఉచితంగా అందిచడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎంతో దృఢ సంకల్పముతో ఈ కార్యక్రమం చేపట్టిందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి, ఈ పథకం వల్ల ఉన్న ఉపయోగాలను గురించి ప్రజలకు వివరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షబానాబాను, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** జులై1 నుంచి 20వ వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయడానికి కౌన్సిలర్లు కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ మనోజకిరణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కౌన్సిలర్లు తమ తమ వార్డు పరిధిలోని సచివాలయాలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలు పాల్గొనేందుకు కోసం అవగాహన కల్పించాలని సూచించారు. వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ హిందూ శ్మశాన వాటికలకు తగినంత నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించండి

ప్రజాశక్తి-గాలివీడు


గాలివీడు : సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వరరాజు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణంలో స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చిన తర్వాత విద్యార్థుకు విద్యాబుద్ధులు చెప్పే బాధ్యత మాకు ఉంటుందని అన్నారు. పిల్లలు ఇంటి దగ్గర ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక దృష్టి ఉంచి చదువుపై మక్కువ పెంచేలా ప్రోత్సహించాలన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై శ్రద్ధ వహించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫైరోస్, షబానా, భగీరథి రమ ణయ్య, గంగయ్య, నాగరాణి, మదీనా, వాణిశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** తల్లిదండ్రులకు ప్రోత్సాహం వలన పిల్లల భవిష్యత్తు ఉంటుందని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎపి మోడల్ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అందుబాటులో ఉందన్నారు. 2021-22 నుంచి 6 నుంచి 10 తరగతిలో విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తుందని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి, వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. మంగళవారం కొండ్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో నాడు-నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఐ లవ్ రీడింగ్, లర్న్ ఎవర్డ్ఎ డే, క్లాస్ రూమ్ బేస్డ్ అసిస్టెంట్, సబ్జెక్టు టీచర్ల ఏర్పాటు, టి.ఎం.ఎఫ్ ఏర్పాటు, ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలు వంటి వివిధ అంశాల పైన చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ చౌడవరం నరసింహ, ఉపాధ్యాయులు రఘునాథ్, సుబ్బారెడ్డి, చాంద్‌భాషా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వంద శాతం లక్ష్య సాధనగా పనిచేయాలి

ప్రజాశక్తి-ములకలచెరువు


వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ శేషగిరిబాబు

అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో వందశాతం లక్ష్యాలు సాధించాలని జిల్లా ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ శేషగిరిబాబు అన్నారు. జాతీయ ఆరోగ్యమిషన్ కార్యక్రమ అమలు పర్యవేక్షణలో భాగంగా డాక్టర్ శేషగిరిబాబు మంగళవారం మండలంలోని మొలకలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి దస్త్రాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఎన్‌సిడి సిడి సర్వే, ఆరోగ్యశ్రీ లోని ఎఎన్‌ఎం ఫీడ్‌బ్యాక్, వెక్టార్ కంట్రోల్, ఆర్‌సిహెచ్ పోర్టల్ నిర్వహణ, అనిమియా ముక్త్ భారత్, గ్రామ పారిశుధ్య పోషణ, జన ఆరోగ్య సమితి ఖాతాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వందశాతం లక్ష్య సాధనకు అనుగుణంగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం డ్రగ్స్ స్టోర్స్ ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ ఝాన్సీ, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, ఎంపిహెచ్ఇఒ రమణ, సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్, సిహెచ్ఒ ఆరోగ్య పర్యవేక్షకులు స్టాఫ్ నర్సులు, ఫార్మసీసిస్టులు పాల్గొన్నారు.


అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చక స్వాములు

వైభవంగా సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నందలూరు

శ్రీ సౌమ్యనాథ బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జగద్రక్షకుడైన శ్రీ సౌమ్యనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతున్నాయి అని తెలపడానికి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు జరిగే ఏర్పాట్లను శ్రీ వారి తరఫున ఆయన సర్వ సైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడు వారు సమీక్షించే కార్యక్రమాన్ని అంకురార్పణ అంటారు. అంకురార్పణకు నవధాన్యాలు, కలశ స్థాపనలు, పూర్ణకుంభ ప్రతిష్ఠ , పుణ్యాహవాచనాలకు బియ్యం, నెయ్యి, బెల్లం ,టెంకాయలు, తమలపాకులు సమకూర్చారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం అర్చక స్వాములతో ఆగ్నేయ మూలలో వెలసి వున్న పుట్ట వద్ద పలుగు, పారలకు , పుట్టకు పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా గురు దేవతను లిఖించి ఆహ్వానించారు. పూజాది కార్యక్రమాలను పూర్తి చేసి లిఖించిన భూ దేవత నుంచి కొంత పుట్ట బంగారం సేకరించి అంకురార్పణ మంటపంలో ఏర్పాటు చేసిన 12 పాలికలలో పుట్ట బంగారం ఉంచి అందులో నవధాన్యాలు చల్లి అంకురింప చేసే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూల వరులకు, ఉత్సవ వరులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవ వరులకు ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేడావిజయభాస్కర్ రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, సోమిశెట్టి ప్రభాకర్, అరిగె నాని, కాకి చంద్ర, నాగసుబ్బయ్య, సుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు. రెండవ రోజు బుధవారం ఉదయం ధ్వజారోహణం, తిరుమంజనం రాత్రికి యాలివాహనంపై శ్రీ సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు జెఇఒ నటేషన్ తెలిపారు.

హాస్టల్ మెస్ ఛార్జీలు పెంచాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వసతి గృహ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. పట్టణంలోని స్థానిక ఎస్ ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో అర్ధాకలితో అలమటిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు తక్షణమే మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ రంగానికి పెద్దపీట వేస్తామని, సంక్షేమ హాస్టళ్లకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి నేడు మాట మార్చి మడమ తిప్పారన్నారు.ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి ఉద్యమం చేస్తామని., రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, కార్తీక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ


శాంతికమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రహీముల్లా

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకుందాం

ప్రజాశక్తి-కలికిరి

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకుందామని ముస్లిం సోదరులకు ఎస్ఐ ఎస్.కె.రహీముల్లా తెలిపారు. ఈ నెల 29న ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకను నిర్వహించనున్న నేపథ్యంలో కలికిరి పోలీస్ స్టేషన్‌లో సోమవారం మండలంలోని అన్ని మసీదుల ముస్లిం సోదరులతో పాటు హిందూ, క్రైస్తవ సోదరులతో ఎస్ఐ శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా పండుగరోజు తమ పిల్లలు ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను రోడ్లపై నడపకుండా ముందస్తుగా తల్లిదండ్రులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని మతాలు వారు కలిసి మెలిసి పండుగను ప్రశాంతంగా జరగడానికి సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈద్గాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఐ, ఎఎస్ఐ మధుసూధనాచారిని హిందూ ముస్లిం మైనార్టీలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని రాయవరం గ్రామం కస్పాలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉపాధ్యాయుల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సర్పంచ్ షరీఫ్, ఎంఇఒ రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు ఎస్. హషీమా, మనీప్రసాద్, చంద్రశేఖర్, రోషన్‌బేగ్, జాకీర్‌హుస్సేన్‌లను దుశ్శాలువాతో సన్మానించి అభినందించారు. బదిలీపై వెళ్లే పాఠశాలల్లో కూడా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలవాలని ఆకాంక్షించారు.

డాక్టర్ పద్మలలితకు బెస్ట్ ఉమెన్ ఇంజినీర్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి-రాజంపేట

బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇఇఇ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.పద్మలలితకు బెస్ట్ ఉమెన్ ఇంజినీర్ టీచర్ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎస్ఎంవి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఎపిసెక్షన్, జెఎన్‌టియు అనంతపురం వారు 2022కు గాను ఈనెల 23న అవార్డును ప్రకటించారని తెలిపారు. బెస్ట్ ఉమెన్ ఇంజినీర్ టీచర్ అవార్డును డాక్టర్ ఎం.పద్మలలిత ఆగష్టు 12న విజయవాడలో అందుకోనున్నట్లు తెలిపారు. కళాశాల యాజమాన్యం , ప్రిన్సిపల్, డీన్స్, వివిధ విభాగాల హెచ్‌ఒడిలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ ఎం.పద్మలలితను అభినందించారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేవులపల్లి సచివాలయం పరిధిలో ఎస్‌సి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నవాపేట పంచాయతీలో ఒసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ సచివాలయ పరిధిలో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఈనెల 29న దరఖాస్తులను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అందించాలని, 30న పరిశీలించిన అనంతరం జులై 7, 8 వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించి, 9న శిక్షణ ఇచ్చి 10న నియామకలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అర్హత, ఆసక్తి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

రామసముద్రం : మండలంలోని దిన్నెపల్లె సమీపంలోని ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను 7,8,9 తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ మునుస్వామి నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 29 లోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 30న ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వండి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఉన్న రౌడీ షీటర్లను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్‌పి గంగాధరరావు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లా డుతూ మండలంలో గతంలో ఘర్షణలకు పాల్పడి రౌడీషీటర్లుగా నమోదైన వారందరినీ పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. రౌడీషీటర్లుగా నమోదైన వారి ప్రవర్తన ఎలావుందో గ్రామాలలో విచారించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ఈనెల 29న ముస్లిం సోదరులు నిర్వహించుకోనున్న బక్రీద్ పండుగను సామరస్యంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకాల్లో, దొంగతనాల్లో నిఘా ఉంచాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎసిఐ తిప్పేస్వామి, ఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సునీల్, శశికుమార్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి గంగాధర్‌రావు

క్రైం కార్నర్

అదుపుతప్పి ఆటో బోల్తా : బాలుడి మృతి

ప్రజాశక్తి-రామాపురం


మృతి చెందిన బాలుడు రెడ్డిగణేష్

ఆటో అదుపుతప్పి బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నల్లగుట్టపల్లి వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై నల్లగుట్టపల్లి సచివాలయం క్రాస్ వద్ద ఆటో బోల్తా పడి లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నెపాడుకు చెందిన రెడ్డిగణేష్(2) అనే బాలుడు మృతి చెందగా, బాలుడి మేనమామ తురక సూరి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. తురక సూరి తన మేనల్లుడును ఆటోలో ఎక్కించుకొని రామాపురం నుంచి బిసి కాలనీకి వస్తుండగా సచివాలయం సమీపంలో ఆటోలో స్టీరింగ్ పనిచే యకపోవడంతో అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో రాయచోటి ఆస్పత్రికి చేర్చామని, బాలుడి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు వెల్లడించారు.